తాన్ని, రాయలసీమను రతనాలసీమగా మార్చి గణుతికెక్కిన శ్రీ కృష్ణదేవరాయలు తన ఆస్థాన మంత్రికి భరణంగా ఇచ్చినట్టు నిదర్శనముంది. ఈయన నామధేయార్థం "అప్పాజీ" అనే పేరుతో "అప్పరాజు చెర్వు"ను నిర్మించటం, దేవాలయాన్ని నిర్మించటం జరిగిందని పెద్దలు చెబుతున్నారు. అంతేగాక ఆలయం వెనుక భాగాన దేవనాగరలిపిలో ఒక శాసనముంది. దీన్ని స్థానిక ఆర్కియాలజీ శాఖవారు రాయలకాలం నాటిదని తెలియజేశారు. కాని దీనిమీద తుదినిర్ణయం గైకొనలేదు. ఈశ్వరాలయంలో పంచలింగాల ప్రతిష్ఠ జరిపించటం ప్రత్యేకత. ఆలయ గోపురం రాయలకాలం నాటిదని వారే తెలియజేశారు. అందువల్ల సంగమేశ్వరం అయింది. ఇంకా ఈ నదుల సంగమంలో కొన్ని ఏండ్లనాడు నదులు విలయతాండవం చేసినపుడు "చాముండేశ్వరి" విగ్రహం బయలు పడింగి. అది ఇప్పటికీ నదులు కలిసే ప్రాంగణంలోనే వుంది. స్థలమాహాత్మ్యాన్నిబట్టి పంచలింగాల ప్రతిష్ఠ జరిగిందంటున్నారు. ఈ నదుల స్థానంలో ఒకప్పుడు "తుమ్మరాయుని పట్నం, పరితిగడ్డ" అనే గ్రామాలున్నాయట. వీటికి సంబంధించిన గ్రామ చరిత్రల్ని సర్వే చేయవలసివుంది. అక్కడక్కడ, కొన్ని విగ్రహాలు ఆనాటి పనిముట్ల తునకలు (ముక్కలు) పడి వున్నాయి.

ఈశ్వరాలయంలో ప్రతిశనివారం నిత్యనైవేద్యాలతో పంచలింగాల్ని అభిషేకిస్తున్నారు. ప్రతిఏడాది శివరాత్రి పర్వదినాన భక్తులజాగరణ ఉత్సవం జరుగుతూనే వుంది. ఈ ఆలయ ప్రాంగణంలో విశాలంగా నిర్మించిన సత్రముంది. ఇది వివాహాది శుభకార్యాలకు అనువుగా వుంది. అనేక వివాహాలు ఇప్పటికీ జరుగుతునే వున్నాయి. ఈ ఆలయం దేశచరిత్రలో పేరు వహించటానికి అప్పాజీగారి పేరుతో చెరువును నిర్మించటం, ఆలయం నిర్మించటం ఒక కారణం. ఇంకో విశేషం శ్రీకృష్ణదేవరాయలు మహామంత్రి తిమ్మరుసును బంధించి కళ్ళు పెరికించినాడని ఒక ఐతిహ్యముంది. మరలా నిరపరాధి అని రాయలు తెలుసుకొని పశ్చాత్తాపపడటం తెలిసినవిషయమే. వీటికి నిదర్శనంగా అదేగ్రామంలో 'అపరాధి, అపరాధయ్య' అనే పేర్లు ఇప్పటికికూడా వున్నాయి. చెరువుకట్ట దగ్గర 'అపరాధయ్య' అనే పేరుతో 'చిన్నబండ' వుంది. పూజ చేస్తున్నారు.

'సంగరామేశ్వరక్షేత్రం' గా పేరు రావటానికి కొన్ని ఏండ్ల క్రితమే రామాలయ నిర్మాణం జరిగింది. కానీ సప్తద్వారాల సొగసు పూర్తికాలేదు. ఈశ్వరాలయం వున్నపుడు చుట్టూ గుట్టలు, పెద్ద పెద్ద రాళ్ళుమాత్రమే వుండేవి. ఈ ఆధునిక యుగంలో యజ్ఞయాగాది క్రతువులు చేయుటకు భక్తాదులు ముందుకు రావటం అరుదు. ఇలాంటి గుట్టలుగల ప్రదేశంలో ఇద్దరు అవధూతలు తిరుగుతుండేవారు. వాళ్ళు ఆ రాళ్ళపై తిరుగుతూ ఇక్కడ రామాలయం నిర్మింపబడుతుంది. ఎక్కడ నుంచో స్వామీజీ వస్తారు. అని అక్కడ నివాసమున్నవారితో చెప్పేవాళ్ళు కానీ వారిని ఆ ప్రజలందరు తిక్కమల్లప్ప ఎర్రి చెన్నప్ప, అనే వారట. వారి సమాధులు ఇప్పటికీ ఇక్కడే వున్నాయి. తర్వాత కొన్ని ఏండ్లకు శ్రీ రామకృష్ణానంద స్వామీజీ' అప్పరాజుచెర్వు గ్రామానికి వచ్చి సంగమేశ్వరాన్ని చూచి చుట్టూ గ్రామస్థుల్ని కూడవేసి ధనధాన్యాల్ని వసూలుచేసి రామాలయాన్ని అందరి సహకారంతో నిర్మించారు. రామాలయంలో విగ్రహాలు ప్రతిష్ఠించారు. 1974 లో రామకోటి మహాయజ్ఞం జరిపించారు. అపుడు మూడు సంవత్సరాలు వర్షాలు ధారగాకురిసి పంటలు సస్యశ్యామలంగా పండాయి. వీరు నివాసమున్నస్థలానికి 'శాంతి సౌధం' అని పేరు పెట్టుకొన్నారు. ప్రక్కనే శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ పద్మావతి ఆలయా లున్నాయి. ఇచ్చట భక్తాదులు తమ తలనీలాల్ని ఆ దేవదేవునికి అర్పిస్తున్నారు. శ్రీ వేంకటేశ్వర ఆలయం వెనుకనే శ్రీ రామకోటి క్రతుస్థూపముంది. ఈ క్షేత్రంలో అఖిలాంధ్ర సాధుపరిషత్ వారు సభలుకూడా జరిపారు. వారి సౌజన్యంతోనే ఒక పుస్తకంకూడ వెలువడింది. ఇటీవలనే నవగ్రహాల ప్రతిష్ఠ జరిపించి 'రెండవ పావగడ' (పాగాండ)గా కూడ పేరు గడించింది ఈ క్షేత్రం.

ఇచ్చట కూడ ఆ శని మహాత్మునికి భక్తాదులు తమ తలనీలాల్ని అర్పిస్తున్నారు. ఒకప్పుడు స్వామీజీగారు అనాథబాలల్ని చేరదీసి చదువుసంధ్యలు, భోజన వసతిని కల్పించారు. ఈ బాలలకు ప్రతి ఏడాదికొకసారి కొద్దిమంది దాతలు ధనసహాయం చేస్తుండేవారు. ఇన్ని హంగులున్న ఈ క్షేత్రం పూర్వం 'సంగం' అని పిలువబడేది. ఈనాడు హరిహరులకు నిలయమై "సంగరామేశ్వరం" అయింది. కానీ ప్రస్తుతం స్వామీజీగారు ఈ క్షేత్రాన్ని వదలి వెళ్ళారు పూజలు మాత్రం అన్ని దేవాలయాల్లో ఏదో కుంటిసాకుగా జరుగుతున్నాయి. ఈశ్వరాలయం, నవగ్రహాల దగ్గర ప్రతిశనివారం ఎంతో భక్తితో పూజారులు కొలుస్తున్నారు. ఇలాంటి క్షేత్రం శిథిలావస్థకు గురికాకుండా ఎంతో వైభవోపేతంగా ఇంకా ముందుకు తీసుకొనివెళ్ళే బాధ్యత అందరి మీద వుంది. చుట్టూవున్న గ్రామస్థులు కలహాలవల్ల పట్టించుకోవటం లేదు. ఎవరిదారినవారు వెళుతున్నారు. ఇలాంటి క్షేత్రాన్ని ముందుకు తీసుకురావటానికి ప్రభుత్వం, లేదా టి.టి.డి. వారు ముందుకు రావాలని విన్నవించుకొంటున్నాము. రాయలసీమ దేవాలయాల పునరుద్ధరణకు కంకణం కట్టుకోవలసిన బాధ్యత ఒక్క తిరుమల తిరుపతి దేవస్థానంవారికే చేతనవుతుందని రాయలసీమ వాస్తవ్యుల నమ్మకం.

— శ్రీ చిగిచర్ల కృష్ణా రెడ్డి.